# ఆస్తి పన్ను చెల్లింపులకు ససేమిరా..!



పన్నుల వసూళ్లలో కార్పొరేషన్ అధికారులు (ఫైల్)

- ఏళ్లుగా చెల్లించని వివిధ ప్రభుత్వ శాఖలు
- రూ.30.55 కోట్ల డిమాండ్‌కు వసూలైంది రూ.1.06 కోట్లే ..
- స్థానిక సంస్థల్లో ప్రగతి పనులపై ప్రభావం

**విజయనగరం:** నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భవనాల ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఏళ్లుగా చెల్లించకపోవడంతో రూ. కోట్లకు చేరి గుదిబండగా మారాయి. ఈ పరిస్థితి స్థానిక ప్రగతి, అభివృద్ధిపై తీవ్ర ప్రభావమే చూపుతోంది. వాస్తవానికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల విషయంలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం నగర పరిధిలో 163 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల భవనాలుండగా రూ.30.55 కోట్ల వరకు బకాయి పడ్డాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.1.06 కోట్లు మాత్రమే వసూలైంది. మరో రూ.29.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అయినప్పటికీ పన్ను వసూలు చేయడంలో కార్పొరేషన్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సామాన్య ప్రజల వద్దకు వచ్చేసరికి మాత్రం అధికార యంత్రాంగం ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది. విజయనగరం పరిధిలో 70,413 భవనాలు ఉండగా.. వాటి ద్వారా రూ. 41.15 కోట్లు ఆస్తి పన్ను రూపంలో రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.22.20 కోట్లు వసూలైంది. 55 శాతం మేర వసూలు చేశారు. అయితే ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఏడాదికి పది శాతం కూడా వసూలు కావడం లేదు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, కొందరు వ్యాపారులు సైతం బకాయిలు ఉన్నారు. కొన్నేళ్ల లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ మొత్తం రూ. కోట్లలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఆ ప్రాంత అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**సామాన్యుల పైనే ప్రభావం..**

పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగం, కుళాయి కనెక్షన్లు నిలిపివేయం వంటి చర్యలు తీసుకునే సిబ్బంది... భారీగా బకాయి పడిన వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా రూ. కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. దీనిపై విజయనగరం కార్పొరేషన్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వివరణ కోరగా.. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. వాటికి సంబంధించి పలు మార్లు నోటీసులు ఇచ్చినా స్పందన తక్కువగానే ఉందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వసూళ్లకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ● వినతి..



గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి సహకరించాలని జరజాపుపేట నవోదయ గ్రంథాలయం కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిధుల మంజూరుకు ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. - నెల్లిమర్ల

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక పునః ప్రారంభం

**విజయనగరం:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వాయిదా పడ్డ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని వారాలుగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందేనన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఇక నుంచి ప్రతి సోమవారం యథావిధిగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు.

## క్లుప్తంగా

### చోడి పంట సాగుపై రైతుల ఆసక్తి



సోమరాజుపేటలో సాగు చేస్తున్న చోడి పంట

**రేగిడి:** చోడిపంట సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 320 ఎకరాల్లో పంట సాగులో ఉందని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఈ పంటకు మార్కెట్ మంచి డిమాండ్ ఉండడంతో పాటు చోడితో చేసే ఆహార పదార్థాలు మెరుగైన ఆరోగ్యానికి ఉపయోగపడుతుండడంతో ప్రతీ రైతు చోడి పంట వేసేందుకు మక్కువ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

### పైడితల్లిని దర్శించుకున్న భక్తులు

**రాజాం/రాజాం సిటీ:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ 99వ జాతర ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే జాతరలో తొలి రోజు నుంచే పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు.

### నేత్ర శస్త్రచికిత్సకు 85 మంది ఎంపిక



వృద్ధురాలి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

**రేగిడి:** స్థానిక విశ్వసాయి మందిరం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 120 మంది కంటి రోగులు శిబిరానికి రాగా వారికి వైద్యులు తనిఖీ చేసి వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 85 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్త సహకారంతో జరిగిన ఈ శిబిరంలో కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా సర్జరీ చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి సురేష్, సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, క్యాంపు కో–ఆర్డినేటర్ అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### టిడ్కో ఇళ్లు అప్పగించండి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు శంకరరావు

**బొబ్బిలి:** టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస వద్ద టిడ్కో కాలనీని ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలోని మొత్తం 1280 ఇళ్లకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే వైఎస్సార్ సీపీ హయాంలో రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం పూర్తయిన ఇళ్లను ఆయా లబ్ధిదారులకు అందించాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు

**బాడంగి:** మండలంలోని రేజేరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 13,500 పశువులు ఉండగా, ఇప్పటివరకు 3,400 పశువులకు ఈ టీకాలు వేశామని పశువైద్యాధికారి సతీష్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూగజీవాలు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు.

### పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

**తెర్లాం:** విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు ఎలా చదివి అర్థం చేసుకోవాలో ఆయన నేర్పించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలగడంతో పాటు అనేకానేక కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులను కోరారు.

## రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలి



రక్తదానం చేస్తున్న మహిళలు

- డీపీఆర్‌ఓ జానకమ్మ

**విజయనగరం ఫోర్ట్:** రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని డీపీఆర్‌ఓ జానకమ్మ అన్నారు. ఆదివారం స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎటువంటి అనారోగ్యం సోకదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి. రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పైడితల్లి, కనకదుర్గ అమ్మవార్ల జాతర



పోలిపల్లి పైడితల్లి



భోగాపురం కనకదుర్గమ్మ

**భోగాపురం:** పోలిపల్లి పైడితల్లి, భోగాపురం కనకదుర్గమ్మ జాతరలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా ఆలయాల వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల భక్తులు ఇప్పటికే ఆలయాల వద్దకు చేరుకున్నారు. అమ్మవార్లను దర్శించుకుని, తలనీలాలు చెల్లించి బోనాలు సమర్పించుకుంటారు. జాతర ప్రాంతాలు దుకాణాలు, సర్కస్‌లు, బొమ్మల దుకాణాలతో కళకళలాడుతున్నాయి. అలాగే ప్రధాన రహదారులు, ఆలయ ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సీఐ ఎన్వీ ప్రభాకర్, ఎస్సైలు పాపారావు, సూర్యకుమారి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆ మందిరం.. నిత్యాన్నదాన ప్రాంగణం..

- ఆకలి తీర్చే సాయినాథుడికి నిత్య పూజలు
- 365 రోజులూ అన్నదానంతో కడుపు నింపుకుంటున్న అభాగ్యులు



ఆలయంలో అన్నదాన సత్రం




**విజయనగరం గంటస్తంభం:** నగరంలోని రింగ్‌రోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా మందిరం ఎంతోమంది అన్నార్తుల ఆకలి తీరుస్తోంది. సువిశాలమైన ప్రాంగణం, ప్రశాంత వాతావరణం ఆ మందిరం సొంతం. మనసుకు ప్రశాంతత చేకూర్చే జ్ఞానమందిరంతో పాటు సుమారు 200 మంది ఒకేసారి భోజనం చేయడానికి అనువైన సత్రం ఇక్కడ ఉండడంతో నిత్యం భక్తులతో ఈ ఆలయం కళకళలాడుతోంది.

**ఏడాది పొడవునా..**

రోజూ మధ్యాహ్నం బాబా హారతి అయిన తర్వాత ఇక్కడ అన్నదానం ప్రారంభమవుతుంది. ఈ ఆలయం మీదుగా వెళ్లిన వారరు ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో కమిటీ సభ్యులు ప్రతి రోజూ అన్నదానం చేపడుతున్నారు. పిల్లలు, వీధి వ్యాపారులు, భిక్షాటకులు నిత్యం ఇక్కడ భోజనాలు చేసి వెళ్తుంటారు. ఇక ప్రత్యేకమైన రోజులలో అయితే మరి చెప్పనవరం లేదు. శ్రీరామనవమి, విజయదశమి, దత్తాత్రేయ జయంతి, గురుపూర్ణిమ వంటి రోజులలో వేలాది మందికి అన్నదానం జరుగుతుంది.

**మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు..**

ప్రతి గురువారం మందిరంలో ప్రత్యేక భజనలు, పూజలు చేస్తుంటారు. ఈ సమయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. అలాగే చిన్న చిన్న వ్యాపారులను ప్రోత్సహించేందుకు ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తుంది ఈ ఆలయ కమిటీ.

**భక్తుల సహకారంతో..**



ఇక్కడ నిత్యం జరుగుతున్న నిత్యాన్నదానానికి భక్తులు ఎంతగానో సహకరిస్తున్నారు. చాలా మంది యువత వలంటీర్లుగా వచ్చి సహాయం చేస్తుంటారు. నిత్యం రెండు రకాల కూరలు, పప్పు, సాంబారు, మజ్జిగ, స్వీటు, అన్నంతో పాటు వారాల పూట బిరియానీ, కదంబం, కిచిడి, దద్దోజనం, పులిహోర వంటివి అందిస్తుంటాం.

– కరణం జనార్దనరావు, అధ్యక్షుడు,షిర్డీ సాయిబాబా సేవా సమాజం, విజయనగరం.

## పక్కాగా సర్వేలు

**విజయనగరం:** పన్ను వసూళ్లతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన పీ–4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు సహాయ కమిషనర్ కె.అప్పలరాజు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలు, పన్ను వసూళ్ల ప్రక్రియలను ఆదివారం వ్యక్తిగతంగా పరిశీలించారు.

## ● అన్నసమారాధన



నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామంలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో గడిచిన 49 రోజులుగా శివ పంచాక్షరీ అఖండ నామ సంకీర్తన సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుడు కుమారస్వామి, నాయకులు కడగల ఆనంద్, అల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. - నెల్లిమర్ల రూరల్

# ఏడొంపుల గెడ్డను ఊడ్చేస్తున్నారు..!

- ఏడొంపుల గెడ్డలో ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు
- రోజుకు 150కు పైగా ట్రాక్టర్ లోడ్ల ఇసుక తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



గెడ్డ నుంచి ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు



ఏడొంపుల గెడ్డలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్

**గజపతినగరం రూరల్:** అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఉచిత ఇసుక పాలసీ కూటమి నేతలకు వరంగా మారింది. వాగులు, వంక ల్లో ఎక్కడైనా, ఎవరైనా తమ సొంత అవసరాల కోసం ఇసుకను తవ్వుకుని ఉచితంగా తీసుకువెళ్లవచ్చని, ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో రవాణా చేసుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడంతో ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. గెడ్డలు, వాగులు, నదులను ఊడ్చేస్తున్నారు. అడిగే వారు లేరనే ధీమాతో పగ లు, రాత్రి అని తేడా లేకుండా యథేచ్ఛగా, ఇష్టారీతిగా ఇసుకను తవ్వుకుని విక్రయించుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. గజపతినగరం మండలంలోని చంపావతి నది తో పాటు ఎం.గుమడాం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఏడొంపులగెడ్డలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యమయ్యాయి. ఏడొంపుల గెడ్డలో చేపడుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఆగెడ్డ సహజ స్వరూపం కోల్పోతోంది. గెడ్డలో రాళ్లు తేలుతున్నాయంటే ఇక్కడ ఏ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇసుకాసురులు ఈ గెడ్డ నుంచి రోజూ 25 ట్రాక్టర్లతో 150కు పైగా లోడ్‌ల ఇసుక తరలించేస్తున్నారు. చంపావతి నదిలో పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. దీంతో చంపావతిలో, ఏడొంపుల గెడ్డలో ఉన్న తాగునీటి పథకాలు, చుట్టు పక్క గ్రామాల్లో తాగు, సాగునీటి బోర్లు ఎండిపోతున్నాయని వాటి సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

**అభివృద్ధి పనుల పేరుతో...**

ఇళ్ల నిర్మాణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసమని చెప్పుకుంటూ ఎవరికి ఎంత నచ్చితే అంత ఇసుక తవ్వేస్తు న్నారు. ట్రాక్టర్ల యజమానులు కూలీలను పెట్టుకుని ఇసుకను నగరాల్లోని అపార్ట్‌మెంట్లకు, పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొందరు ఇసుకను ఓచోట డంపింగ్ చేసి అక్కడి నుంచి విక్రయాలు చేస్తున్నారు. చంపావతి నది, ఏడొంపుల గెడ్డకు దగ్గరలో ఉన్న ప్రాంతాల వారికి ట్రాక్టర్ ఇసుక రూ. 2 వేలకు, మండ ల కేంద్రం దాటితే రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు.

**ఎవరికీ చెప్పలేకపోతున్నాం..**



ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చిన తర్వాత ఎవరికీ చెప్పలేకపోతున్నాం. సొంత అవసరాలు, గ్రామాభి వృద్ధి పనులకు అని చెప్పి ట్రాక్టర్లతో ఇసుకు తీసుకు వెళుతున్నారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించకుండా దృష్టి సారిస్తాం.

– ఎస్. రత్నకుమార్, తహసీల్దార్,గజపతినగరం

**ఇసుక రీచ్ లేదు**

ఎం.గుమడాం గ్రామంలో ఇసుక రీచ్ లేదు. ఇసుక తరలింపుపై ప్రత్యేక నిబంధనలు ఏమీ లేకపోవడం వల్ల మేము అడ్డుకోలేకపోతున్నాం. అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న వారిని సంబంధిత శాఖ అధికారులు పట్టుకుని మాకు అప్పగిస్తే చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణరావు, ఎస్‌ఐ, గజపతినగరం

## జూదరుల అరెస్ట్

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని సతివాడలో పేకాటాడుతున్న వారిని శనివారం రాత్రి స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టగా ఆరుగురు నిందితులు పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ.7,520 నగదు సీజ్ చేశామని ఎస్సై గణేష్ తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.